# సుఖం

– దాసరి శిరీష

ఈ మధ్య తరచుగా ఎదురింటి వైపు ఆసక్తిగా చూడడం శేషగిరికి ఓ ఇష్టమైన వ్యాపకంగా మారింది. ఆ కాస్సేపూ ఎడారిలో ఇంద్రధనస్సుని చూసి పరవశించిన వాడిలాగా తన్మయంగా చూస్తూ సంబరపడుతుంటాడు.

మంచం మీద భార్య నీరసంగా మూలిగే మూలుగులా అతని అద్భుత చిత్రాన్ని తొణికిన స్వప్నంగా మారుస్తాయి. కాఫీ సిప్ చేస్తూ జయ వైపు చూసి నిట్టూర్చాడు. ఇంకాస్త దూరంగా తల్లి పోటీగా మూలుగుతూ దోమలు తోలుకుంటూ గొణుక్కుంటూ మధ్య మధ్య గుర్తుకొచ్చిన వాళ్ళందర్నీ తిడుతోంది.

చాప మీద కూచుని బుద్ధిగా హోం వర్క్ చేసుకుంటున్న కొడుకుల్ని చూస్తుంటే వాత్సల్యం పెల్లుబికింది.

అమ్మాయి తర్వాత చాలా ఎడంతో పుట్టిన పిల్లలు. వీళ్ళకి సరయిన చదువులు చెప్పించి భవిష్యత్ చూపించే వరకూ తను ఆరోగ్యంగా వుండగలడా? అసలీ స్పీడ్ యుగంలో అంతవరకూ తన ప్రాణాలు నిలుస్తాయా! అనిపిస్తుంటూంది.

అమ్మాయి పెళ్ళి చేయడమే గొప్ప సాహసంలా ఘనకార్యంలా అయింది తన జీవితానికి. తన తల్లి దండ్రులకి తను ఒక్కడే కొడుకయినందుకూ,హఠాత్తుగా తండ్రి మరణించినందుకూ ఈనాటి వరకూ ఆ బాధ్యతల బరువు తనని కృంగదీస్తూనే వుంది.

పాపం తన అర్ధాంగి ... తనకి తోడు నీడగా నిలిచిన నేరానికి, వెట్టి చాకిరీకి అరిగిపోయి చాలా కాలం నించీ మంచాన్నాశ్రయించి ఒక రకంగా విశ్రాంతి తీసుకుంటోంది.

బలవంతంగా ఆ ఆలోచనలు తప్పించుకుని ఎదురింటి మేడ వైపుకి ఉత్సాహంగా చూశాడు. పూల గుత్తులతో రకరకాల మొక్కలు కనిపిస్తుంటాయి. అవేవో పేరు తెలియని పసుప్పచ్చపూల క్రీపర్ బాల్కనీ మీదకి పాకి కనువిందు చేస్తోంది. ఈ అందాల మధ్య ఆమె... అటూ ఇటూ పచార్లు చేస్తూ కూచుంటూ, ఎటో చూస్తూ రకరకాల భంగిమల్లో తనలో నిద్రపోయిన సౌందర్య పిపాసను తట్టి లేపుతోంది.

ఈ మేడ కొనే వరకూ ఆమె బ్యాక్ గ్రౌండ్ ఎవరికీ తెలియదు. ఇప్పుడు తెలిశాక ఈ పేటలో జనాలు చెవులు కొరుక్కోవడం తప్ప ఏమీ చేయలేక పోతున్నారు. అర్ధరాత్రి తర్వాత ఒకటి రెండు కార్లుగానీ స్కూటర్లుగానీ వచ్చి ఆగుతాయి. పగలంతా నిశ్శబ్దం. అసలక్కడేం జరుగుతుందో తెలియనంతటి ప్రశాంతత స్నిగ్ధత ఆ పరిసరాలలో వున్నాయి.

తనలో ఈ మధ్యనే ఓ వింత కోరిక మొదలయి పెరిగి మహావృక్షమయింది. అది దుర్లభమనిపించినా మనస్సు అదే కావాలంటోంది. ఈ మురికి జీవితంలో, ఈ గానుగెద్దు నడకలో ఒకే ఒక్కసారి జీవితాంతం తలుచుకోవడానికి చిత్రమైన ఉద్వేగ పూరితమైన ఆ అనుభవం కావాలనిపిస్తోంది. నిన్న వచ్చిన ఎరియర్స్ ఆ కోరికని మరీ పెంచుతున్నాయి. అంతకు రెట్టింపు ఖర్చులున్నా సరే. పైగా ఆమె అందరానిదేం కాదు. కొంత ధైర్యం చేస్తే చాలు.

ఇక తాత్సారం చేసి లాభం లేదు. ఆమెతో ఎప్పాయింట్‌మెంట్ ఫిక్స్ చేసుకోవాల్సిందే. అసలు రేటెంతో అనుకుంటూ తల దువ్వుకుని చెప్పులు తొడుక్కుని గబగబా నడిచాడు. గేటు దగ్గర నౌఖరు అటకాయించలేదు. శేషగిరి కూడా ఇక్కడికి రాగలడా అన్నట్టు పైకి మెట్లెక్కుతున్న శేషగిరిని తెల్లబోతూ చూశాడు.

సిట్ అవుట్‌లో కూచుని ఆమె ఏదో పత్రిక చూస్తోంది. అడుగుల చప్పుడికి తలెత్తి ఆశ్చర్యంగా నవ్వింది.

ఏళ్ళ తరబడీ అలవాటయిన ఆఫీసు వీథుల్లో ఒక భాగంగా అప్రయత్నంగా చెయ్యి పైకి లేపి విష్ చేశాడు.

''మీరూ...''

''అదే మీ ఎదురిల్లే. ఆ పెంకుటిల్లు మాదే''

''కూచోండి'' అంది.

కూర్చుని చుట్టూ చూశాడు. పక్కనే కుండీల్లో రంగు రంగుల గులాబీలు ఆమె కట్టుకున్న పింక్ కలర్ చీరతో పోటీ పడుతున్నట్టుగా తలలూపుతున్నాయి. శుభ్రమయిన పరిసరాలు. తనొకప్పుడు ఇల్లు ఎలా అందంగా శుభ్రంగా వుండాలని ఊహించేవాడో అచ్చు అలాగే వుంది. ఆమె అయితే ఊహించనంత అద్భుతంగా వుంది.

''చెప్పండి'' అంది. ఆ మెత్తదనం నవ్వులోదా, స్వరంలోదా?

ఎంతకీ శేషగిరి నోట్లోంచి మాటలు రాకపోవడంతో విషయం చూచాయగా గ్రహించి మర్యాదగా నవ్వింది.

''ఏదయినా కేసా? మీ పై అధికారులతో ...'' జీవితానుభవం ఆమెకి సూటిగా నిర్మొహమాటంగా మాట్లాడడం నేర్పింది.

శేషగిరి చిన్నబుచ్చుకున్నట్టుగా చూశాడు. ''తన

తెలుగు కళాసమితి
న్యూజెర్సీ
ప్రమోద ఉగాది-
కథల పోటీలో
రూ.400/-
తృతీయ బహుమతి
పొందిన రచన

13-4-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక

వాలకం చూస్తే తనే అందుకు రాబోతున్నాడని అనిపించడం లేదా? అప్రయత్నంగా అతని చెయ్యి బట్ట తల మీదకి పోయింది. చిన్నగా దగ్గి, చిరునవ్వుతో అన్నాడు "మీరే ప్రైవేట్‌లో ఖాళీగా వుంటారో చెబితే... వే...వే..." చిరు చెమట్లు పట్టాయి.

ఆమె తదేకంగా చూసింది. ముందు నవ్వొచ్చింది. ఆపుకుంది. ఆ తర్వాత జాలేసింది. రకరకాల మనుష్యుల వికృతమైన ప్రవర్తనలతో పరిచయమున్న ఆమెకి ఇదో పెద్ద విశేషంగా అనిపించలేదు.

"రేటు తెలుసా?" కొంటెగా అంది.

"ఫర్వాలేదు" ధీమాగా అనబోయి నమ్రతగా అన్నాడు. "సరే... రేటు ... రేపు చెబుతా. నిజానికి నాకు రేపు ఆఫ్... అయినా ఫర్వాలేదు. రేపు రాత్రి పన్నెండు తర్వాత రండి... నా పేరయినా తెలియదుగా మీకు? రజని నా పేరు" మళ్ళీ మెత్తగా నవ్వింది.

ఆమె ఒప్పుకున్నందుకు సంతోషంతో కూడిన చులకన భావమో కృతజ్ఞతో. తెలీని చూపుతో శేషగిరి లేచి నిల బడ్డాడు.

వెళ్ళి రమ్మన్నట్టు స్నేహంగా చేయి ఊపింది.

* * *

ఆ రోజంతా ఆఫీసులో శేషగిరి చాలా సంతోషంగా వున్నాడు. స్టాఫ్‌తో జోకులేశాడు.'ఎరియర్స్ ప్రభావంలే ఇది' అని అంతా అనుకున్నారు. సాయంత్రం కోసం ఉద్వేగంగా ఆరాటంగా చూస్తూ ఎలాగో కాలక్షేపం చేశాడు. ఇంటికొస్తూ దార్లో పిల్లలకి స్వీట్స్, భార్యకి వీవాసీసా తీసుకున్నాడు."ఇన్నినాళ్ళ దాంపత్యాన్ని మరచి పోయావా?" అని జయ గుచ్చి గుచ్చి అడుగుతున్నట్టుగా అనిపిస్తోంది.

ఇంటి దగ్గర కొచ్చేసరికల్లా పిల్లలు పరుగు పరుగున ఎదురొచ్చారు.

"నాన్నా మరే మరే ఆ మేడలో ఆంటీ"

"చెప్పంర్రా ఏం జరిగిందీ!"

"అమ్మ ... అమ్మేమో..." చిన్నాడు నగర్చాడు.

శేషగిరికి గుండె ఝల్లుమంది. "కొంపదీసి జయ అంతా కనిపెట్టలేదు గదా! అయినా దెబ్బలాడే ఓపిక లేదే ఆ మనిషికి?" అనుకున్నాడు.

"అది కాదునాన్నా అమ్మకి బాగా జ్వరమెక్కువయింది. ఆయాసపడిపోతోంది. అప్పుడు నేను ఎదురింటి ఆంటీ దగ్గరికెళ్ళి చెప్పాను. ఆమె వెంటనే ఆటో తెప్పించి హాస్పిటల్‌కి తీసికెళ్ళారు. అదిగదిగో వచ్చేస్తున్నారు" పెద్ద బ్బాయి మాటలు పూర్తవకుండానే ఆటో వచ్చి ఆగింది.

శేషగిరి ఖంగారుగా ఆటోలోంచి దిగుతున్న భార్య భుజం పట్టుకున్నాడు. ఒకవైపు శేషగిరీ, ఇంకో వైపు రజనీ పట్టుకోగా జయ భారంగా అడుగులేస్తూ వచ్చి మంచం మీద వాలింది. రజని 'ప్రిస్క్రిప్షన్' మందులూ స్టూలు మీద పెట్టి శేషగిరికి వివరించి వెళ్ళి పోయింది.

అందుబాటులో డబ్బుకు దొరికే సుఖం అటూ, తనను వీడనంటోన్న దుఃఖాల సాహచర్యం ఇటూ! సుఖం వైపు ఆశగా చూడ్డం సహజం. అయితే ఆ సుఖం కన్నా మానవత్వం వెయ్యి రెట్లు గొప్పదై నిలిచినప్పుడు, సుఖాన్ని ఇచ్చేవారికీ, పుచ్చుకునే వారికీ కళ్ళు తడిగాక తప్పదు.

రాత్రి పదయ్యాక శేషగిరి నిశ్శబ్దంగా ఎదురింటి మేడ మెట్లెక్కాడు. డిమ్ లైట్ వెలుతురులో ఆమె అటూ ఇటూ పచార్లు చేస్తోంది.

అడుగుల చప్పుడికి అతని వైపు చూసి "ఇంకా పన్నెండు కాలేదుగా?" అంది చిరునవ్వుతో.

శేషగిరి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. సమయానికి ఇటు వంటి సహాయం ఈ దౌర్భాగ్యుడికి ఎవరూ ఎప్పుడూ అందించలేదమ్మా. క్షమించు నన్ను. నువ్వు దేవతవి నిన్నా దృష్టితో చూస్తే నా కళ్ళు పోతాయి. మందులకీ వాటికీ ఎంతయిందో చెబితే..."

"తొందరేముందీ,వుంచండి" అంది రజని. చాలాకాలం తర్వాత ఘనీభవించిన ఆమె హృదయం కరిగి కన్నీళ్ళ రూపంలో బయటకొచ్చింది. "మీలాంటి భర్త దొరకడం ఆమె అదృష్టం" అంది మనస్ఫూర్తిగా. ●

